సాక్షి
డా. బి ఆర్ అంబేద్కర్ కోనసీమ
శనివారం | 4 | నవంబర్ | 2023



బ్రహ్మోత్సవం.. నయనమనోహరం

వాడపల్లి క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు నయనమనోహరంగా జరుగుతున్నాయి. 10లో▸



పేదలందరికీ ఇళ్లే ప్రభుత్వ లక్ష్యం

ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. 10లో▸

కాలువలకు నీరు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం గోదావరి తూర్పు డెల్టాకు 2,500, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు గొర్రెల శ్రీలక్ష్మీ పావని, మానేపల్లి హర్షవర్ధన్ ఎంపికయ్యారు. హెచ్‌ఎం ఎ.సూర్య కనకదుర్గ, పీడీ అందె సూర్యనారాయణ శుక్రవారం ఈ విషయం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన గత నెల 28న కొత్తపేటలో నిర్వహించిన అండర్–17 జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో శ్రీలక్ష్మీ పావని, హర్షవర్ధన్ అత్యంత ప్రతిభ చూపి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని వివరించారు. క్రీడాకారులిద్దరినీ శుక్రవారం హైస్కూల్‌లో సత్కరించారు. వారిని ఎస్‌ఎంసీ చైర్మన్ మర్రి ఏడుకొండలు, సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ సభ్యులు వడలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, పబ్బినీడి రాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

అమలాపురం రూరల్: వైఎస్సార్ పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకట్రావు అన్నారు. సాకుర్రులో శుక్రవారం పశు విజ్ఞాన బడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సంచాలకుడు డాక్టర్ కర్నీడి మూర్తి, సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి పాడి రైతులకు పలు సూచనలు చేశారు. వెంకటరావు మాట్లాడుతూ, వైఎస్సార్ పశు బీమా పథకం కింద పాడి రైతులు రూ.400 చెల్లిస్తే వారి పశువులకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకూ బీమా లభిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ పశు పోషకుల అవార్డు అందుకున్న గోశాల వ్యవస్థాపకుడు నాగేంద్రశర్మను సన్మానించారు. ఆర్‌బీకేలో రిఫ్రిజిరేటర్‌ను ప్రారంభించారు. పశు ఆరోగ్య కార్డులను, పశు బీమా సర్టిఫికెట్లను వెంకట్రావు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, సర్పంచ్ గుత్తుల చిరంజీవి, పశు వైద్యాధికారి డాక్టర్ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

10న బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

అంబాజీపేట: బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా ఈ నెల 10వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు పీకే రావు తెలిపారు. విజయవాడ గొల్లపూడిలోని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ భవనంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి అప్పగించిన ఈ బాధ్యతను నిబద్ధతతో నెరవేరుస్తానని చెప్పారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు పేద బ్రాహ్మణులకు అందేలా చూస్తానన్నారు. ప్రమాణ స్వీకారోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ముంపు బాధకు మోక్షం

- లింక్ డ్రెయిన్ డ్రెడ్జింగ్‌కు రూ.87 లక్షలు
- దేశకోడు సైఫన్ తొలగింపునకు రూ.40 లక్షలు
- వరద నియంత్రణ నిధులు రూ.1.27 కోట్ల కేటాయింపు
- మూడు మండలాల్లో 12 వేల ఎకరాలకు మేలు

సాక్షి, అమలాపురం: మూడు మండలాల్లో సుమారు 12 వేల ఎకరాల ఆయకట్టును, పలు లోతట్టు కాలనీలను ముంచెత్తుతున్న లోయర్ కౌశిక లింకు డ్రెయిన్‌కు, దేశకోడు మురుగునీటి కాలువపై గతంలో నిర్మించిన సైఫన్ తొలగింపునకు త్వరలో మోక్షం లభించనుంది. దశాబ్దాల కాలం నుంచి అమలాపురం, అయినవిల్లి, అల్లవరం మండలాల్లోని ఆయకట్టు ముంపునకు ప్రధాన కారణమవుతున్న ఈ రెండింటి పనులకు ప్రభుత్వం కేటాయించిన వరద నియంత్రణ నిధులు వెచ్చించనున్నారు. ఈ పనులు పూర్తయితే ఆయకట్టు రైతులకు ముంపు సమస్య చాలా వరకూ తప్పనుంది.

లింకు డ్రెయిన్ పూడుకుపోయి..

అల్లవరం మండలం లోయర్ కౌశిక, ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్ప మేజర్ డ్రెయిన్ మొదలయ్యే చోట (జీరో కిలోమీటర్) ఈ రెండు డ్రెయిన్లకు చెందిన ఉప్పుటేరు (కంబైన్డ్ కోర్సు) ప్రారంభమవుతోంది. ఈ రెండు డ్రెయిన్ల నీరు ఉప్పుటేరు ద్వారా పర్రభూమి(సాంప్)లోకి, అక్కడి నుంచి నక్కా రామేశ్వరం మొగ ద్వారా సముద్రంలోకి చేరుతోంది. ఉప్పుటేరు, లోయర్ కౌశిక మధ్య 1.20 కిలోమీటర్ల పొడవున సహజసిద్ధమైన లింకు డ్రెయిన్ ఉంది. ఇది పూడుకుపోయింది. గతంలో దీనిని వదిలిపెట్టి వాసాలతిప్ప డ్రెయిన్, లోయర్ కౌశిక డ్రెయిన్లపై జీరో కిలోమీటర్ నుంచి ఎగువకు డ్రెడ్జింగ్ చేశారు. అధికారులు ప్రధాన డ్రెయిన్లలో జీరో కిలోమీటర్ నుంచి ఎగువకు పూడిక తొలగిస్తున్నారు. అదే సమయంలో సముద్ర కెరటాలకు మొగలు మూసుకుపోతున్న సమయంలో మాత్రమే సాంప్ వద్ద పూడిక తీస్తున్నారు. ఈ క్రమంలో కీలకమైన లింకు డ్రెయిన్‌లో పూడిక తొలగింపు పనిని గాలికి వదిలేస్తున్నారు.



లోయర్ కౌశిక - ఉప్పుటేరు మధ్య పూడుకుపోయిన లింకు డ్రెయిన్ ప్రాంతం

తోడవుతున్న ఆక్వా బురద

డ్రెడ్జింగ్ చేయకపోవడానికి తోడు ఆక్వా చెరువుల నుంచి బురద నీటిని యథేచ్ఛగా మురుగునీటి కాలువల్లోకి తోడుతున్నారు. దీంతో ఆ బురద కాస్తా ఉప్పుటేరు, లింకు డ్రెయిన్లలో మేటలు వేసింది. ఇక్కడ సముద్ర పోటు సమయంలో లోతు 3.50 అడుగులు మాత్రమే ఉంటోంది. పాటు రెండు అడుగులు మాత్రమే ఉంటోంది. మురుగునీటి కాలువల లోతు 10 అడుగుల వరకూ ఉంటుంది. లింకు డ్రెయిన్ పూడుకుపోవడంతో ఇక్కడి నుంచి ముంపు నీరు వేగంగా దిగడం లేదు. దీనివల్ల అల్లవరం, అమలాపురం మండలాల్లోని సుమారు 12 వేల ఎకరాల వరి ఆయకట్టు భారీ వర్షాల సమయంలో వారం పది రోజుల పాటు ముంపులో చిక్కుకుని, వరి చేలు కుళ్లిపోతున్నాయి.



దేశకోడు డ్రెయిన్‌పై ముంపునీరు వెళ్లేందుకు అడ్డంగా ఉన్న సైఫన్

ఉప్పుటేరు డ్రెడ్జింగ్‌కు నిధులు

లింకు డ్రెయిన్ పూడిక సమస్యను 'అదీ లింకు' శీర్షికన గతంలో 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. దీని డ్రెడ్జింగ్‌కు గత ఏడాది చమురు సంస్థల కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ (సీఎస్‌ఆర్) నిధులు రూ.66 లక్షలు కేటాయించారు. వారు ముందుకు రాకపోవడంతో ఈసారి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వరద నియంత్రణ నిధులు రూ.87 లక్షలు కేటాయించారు. ఇప్పటికే టెండర్లు పూర్తయిన ఈ పనులు మూడు నాలుగు రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఇక్కడ డ్రెడ్జింగ్ జరిగితే లోయర్ కౌశిక పరిధిలోని ఆయకట్టుకు ముంపు సమస్య చాలా వరకూ తప్పనుంది.

త్వరలోనే పనులు ప్రారంభం



లోయర్ కౌశిక, దేశకోడు డ్రెయిన్ల పరిధిలో ముంపునకు కారణమవుతున్న లింకు డ్రెయిన్ పూడిక, దేశకోడు మీద సైఫన్ తొలగింపునకు కలెక్టర్ హిమాన్షు శుక్లా చొరవ చూపి, నిధులు మంజూరు చేశారు. ఈ పనులకు టెండర్లు కూడా ఖరారయ్యాయి. మూడు నాలుగు రోజుల్లో పనులు మొదలుపెట్టే అవకాశముంది. ఈ రెండు పనులూ పూర్తయితే మూడు మండలాల్లోనూ ముంపు సమస్య తగ్గుతుంది.

– కిషోర్, డీఈఈ, డ్రెయిన్స్, అమలాపురం

సైఫన్ తొలగింపునకు రూ.40 లక్షలు

అల్లవరం మండలంలో మరో కీలక డ్రెయిన్ దేశకోడులో మురుగునీరు పారేందుకు అడ్డంగా ఉన్న సైఫన్ తొలగింపునకు సైతం వరద నియంత్రణ నిధులు రూ.40 లక్షలు కేటాయించారు. మూడు దశాబ్దాలుగా ఈ కాలువకు ఈ సైఫన్ అడ్డంగా ఉంది. 50 ఎకరాల లోపు ఆయకట్టుకు నీరందించేందుకు ఏర్పాటు చేసిన ఈ సైఫన్ మూడు మండలాల్లో వరి చేల ముంపునకు కారణమవుతోంది. గతంలో దేశకోడు అనేది 4 మీటర్ల వెడల్పున ఉన్న మైనర్ డ్రెయిన్. ఈ డ్రెయిన్‌ను 1989లో ప్రపంచ బ్యాంకు నిధులతో 40 మీటర్ల వెడల్పున తవ్వి, మేజర్ డ్రెయిన్‌గా విస్తరించారు. కానీ సైఫన్‌ను అలాగే వదిలేశారు. దీనివల్ల డ్రెయిన్ నీరు పూర్తి స్థాయిలో ప్రవహించకుండా ఈ సైఫన్ వద్ద నిలిచిపోతోంది. అయినవిల్లి, అమలాపురం మీదుగా కుమ్మరి కాలువ ద్వారా వస్తున్న ముంపునీరు అల్లవరం సమీపంలోని అవుట్‌ఫాల్ స్లూయిజ్ ద్వారా వైనతేయ గోదావరి నదిలో కలవాల్సి ఉంది. వరదల సమయంలో ఈ స్లూయిజ్‌లు మూసివేస్తారు. అప్పుడు ఇక్కడి ముంపునీరు దేశకోడు మీదుగా లోయర్ కౌశిక ద్వారా సముద్రంలో కలవాలి. అయితే ఇక్కడ సైఫన్ అడ్డంగా ఉండటంతో నీరు వేగంగా దిగడం లేదు. ఫలితంగా అయినవిల్లి, అల్లవరం, అమలాపురం మండలాల్లో వరి చేలతో పాటు లోతట్టు ప్రాంతాల కాలనీలు ముంపులో చిక్కుకుంటున్నాయి. సైఫన్ తొలగింపునకు నిధులు కేటాయించారు. టెండర్లు ఖరారు కావడంతో ఇక్కడ కూడా పనులు ఆరంభం కానున్నాయి. డ్రెయిన్స్ అధికారులు చేపట్టిన ఈ రెండు పనులూ పూర్తయితే ఈ మూడు మండలాల్లో చాలా వరకూ ముంపు బాధ తప్పుతుందని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా 'సీస్' సర్వే

- 715 పాఠశాలల్లో నిర్వహణ
- పరీక్ష రాసిన 23,072 మంది విద్యార్థులు



రాజోలు జెడ్పీ హైస్కూలులో సీస్ పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న డీఈఓ కమలకుమారి

రాయవరం: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే (సీస్) శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో జరిగింది. జిల్లా వ్యాప్తంగా 715 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ పరీక్ష నిర్వహించారు. ఓఎంఆర్ బేస్డ్ విధానంలో 3, 6, 9 తరగతి విద్యార్థులకు ఈ పరీక్ష పెట్టారు. జిల్లా వ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, డీఎడ్, బీఎడ్ కళాశాలల పరిధిలోని 1,075 మంది విద్యార్థులు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల హోదాలో పరీక్ష నిర్వహించారు. విద్యార్థుల్లో ఇంగ్లిష్/తెలుగు, గణితం ప్రాథమిక భావనలు తెలుసుకునేందుకు ఈ పరీక్ష నిర్వహించారు. డీఈఓ ఎం.కమలకుమారి నేతృత్వంలో డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు, డీఈఓ కార్యాలయ ఏడీ ఎన్.సురేష్, ఏపీఓ బి.ఆదినారాయణమూర్తి పరీక్ష నిర్వహణను పరిశీలించారు. మూడో తరగతిలో 6,527, ఆరులో 8,057, తొమ్మిదో తరగతిలో 7,411 మంది విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో పరీక్ష రాశారు. తెలుగు మీడియంలో మూడో తరగతి 427, ఆరులో 269, తొమ్మిదో తరగతి 381 మంది రాశారు. సర్వేలో 1,224 మంది సబ్జెక్టు ఉపాధ్యాయులు కూడా ఉపాధ్యాయ ప్రశ్నావళి పూర్తి చేశారు. సమగ్ర శిక్షా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఆల్టర్నేటివ్ స్కూల్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ డి.రమేష్ బాబు, ఏఎంఓ పి.రాంబాబు, ఏపీఓ ఎంఏకే భీమారావు, ఐఈఆర్‌టీ కో ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, ఉర్దూ ఏఎంఓ మొయినుద్దీన్ తదితరులు సీస్ పరీక్షను పర్యవేక్షించారు.

114 బస్తాల కొబ్బరి కొనుగోలు



అంబాజీపేట: స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న నాఫెడ్ కొనుగోలు కేంద్రంలో 114 బస్తాల కొబ్బరిని కొనుగోలు చేసినట్లు ఏపీ ఆయిల్‌ఫెడ్ మేనేజర్ యు.సుధాకరరావు శుక్రవారం తెలిపారు. బుధ, గురు, శుక్రవారాల్లో 57 క్వింటాళ్ల (114) కొబ్బరి కేంద్రానికి వచ్చిందన్నారు. ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుల నుంచి కొబ్బరి రావాల్సి ఉందన్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు కొబ్బరి కొనుగోలు చేస్తామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట కార్యాచరణ

- నిష్పక్షపాతంగా నిర్వహణ
- అధికారులకు జేసీ నుపూర్ అజయ్ ఆదేశం

అమలాపురం రూరల్: వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్ట కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అమరావతి నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఎస్పీలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అనంతరం జేసీ నుపూర్ అజయ్ అధికారులనుద్దేశించి మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 9న చెన్నైలో సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ముందస్తుగా ఈ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసిందన్నారు. పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను, జోనల్ సెక్టార్ అధికారులను నియమించాలని సూచించారు. శాంతిభద్రతలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పరిరక్షణకు పోలీసు అధికారులను నియమించాలన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్, డిస్పాచ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను శ్రీనివాసా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని చెప్పారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు, అపరాధాలను నిరోధించేందుకు రూపొందించిన సీ విజిల్ తదితర యాప్‌లలో వచ్చే ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల లొకేషన్లు, కమ్యూనికేషన్ ప్రణాళికలు రూపొందించాలని జేసీ నుపూర్ అజయ్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ పరంగా కార్యాచరణ సిద్ధం చేస్తామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో పోలీసు యంత్రాంగం కీలకంగా వ్యవహరిస్తుందని అన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ నుపూర్ అజయ్, ఎస్పీ శ్రీధర్ తదితరులు

బడుగుల ముంగిట విద్యుత్ వెలుగులు



బిడదవోలు రూరల్ మండలం పమిత్రగూడెంలో ఉచిత విద్యుత్ పొందుతున్న కాలనీ

- ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు ఉచితంగా సరఫరా
- 200 యూనిట్ల వరకూ వినియోగించే వారికి మేలు
- ఉమ్మడి తూర్పు గోదావరిలో 1,81,193 మందికి లబ్ధి
- ప్రతి నెలా రూ.7.86 కోట్లు భరిస్తున్న ప్రభుత్వం

సాక్షి, రాజమహేంద్రవరం: బడుగుల అభ్యున్నతికి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలును విస్తృతం చేస్తోంది. వారి ఆర్థికాభివృద్ధికి బాసటగా నిలుస్తోంది. అంతటితో ఆగకుండా వారిపై విద్యుత్ భారం కూడా పడకుండా కూడా చర్యలు తీసుకుంటోంది. ఎస్సీ, ఎస్టీ వర్గాల వారి ఇళ్లకు ఉచిత విద్యుత్ అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది. నెలకు 200 యూనిట్ల వరకూ విద్యుత్ వినియోగించే వారిపై బిల్లుల భారం పడకుండా ఆ మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. ఆయా వర్గాల నుంచి నయాపైసా వసూలు చేయకుండా విద్యుత్ పంపిణీ సంస్థలకు (డిస్కమ్) నేరుగా చెల్లిస్తోంది. ఈ నిర్ణయంతో తమకు ఎంతో ఉపశమనం కలుగుతోందని ఆ వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల హామీ కార్యరూపం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల ఇళ్లకు ప్రతి నెలా 100 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా అందించేవారు. అది కూడా అరకొరగానే అమలయ్యేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నెలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందజేస్తామని నాడు ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ హామీకి కార్యరూపం ఇచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా డిస్కమ్‌లకు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1,81,193 మందికి లబ్ధి

ఈ పథకం ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,81,193 కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. వీటిలో ఎస్సీ కుటుంబాలు 1,30,392, ఎస్టీ కుటుంబాలు 50,801 ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకూ క్రమం తప్పకుండా ఈ కుటుంబాలకు నిరంతర విద్యుత్ వెలుగులు అందిస్తున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రయోజనం కల్పిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో సమస్య ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తే వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నారు. విద్యుత్ రాయితీ అందకపోతే గ్రామ/వార్డు సచివాలయాల్లో సంప్రదిస్తే పరిష్కారం చూపుతున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన అరకొర విద్యుత్ సబ్సిడీతో పోల్చుకుంటే ప్రస్తుతం మూడు రెట్లు అదనపు ప్రయోజనం కలుగుతోందని ఆయా వర్గాలు చెబుతున్నాయి.

నాలుగేళ్లుగా రూ.377.28 కోట్ల చెల్లింపు

ఉమ్మడి జిల్లాలో ఇళ్లకు ప్రస్తుత టారిఫ్ ప్రకారం 30 యూనిట్ల వరకూ యూనిట్‌కు రూ.1.90, 31 నుంచి 75 యూనిట్ల వరకూ రూ.3.76, 125 యూనిట్ల వరకూ రూ.4.50, 126 నుంచి 225 యూనిట్ల వరకూ రూ.6 చొప్పున వసూలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,81,193 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ప్రతి నెలా 1,53,05,397 యూనిట్ల వరకూ విద్యుత్ వినియోగిస్తున్నాయి. దీనికి గాను ప్రతి నెలా రూ.7.86 కోట్ల మేర బిల్లులు వస్తున్నాయి. ఈ మొత్తాన్ని ప్రభుత్వమే ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీ ఈపీడీసీఎల్)కు చెల్లిస్తోంది. ప్రతి నెలా అంత పెద్ద మొత్తంలో భారం పడుతున్నప్పటికీ బడుగుల సంక్షేమం కోసం ఏమాత్రం వెనకడుగు వేయకుండా నాలుగేళ్లుగా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి నేటి వరకూ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన బిల్లులు రూ.377.28 కోట్ల మేర ఏపీ ఈపీడీసీఎల్‌కు చెల్లించింది.

జిల్లా	ఎస్సీ (విద్యుత్ సర్వీసులు)	ప్రభుత్వం చెల్లించే మొత్తం (రూ.లక్షల్లో)	ఎస్టీ (విద్యుత్ సర్వీసులు)	ప్రభుత్వం చెల్లించే మొత్తం (రూ.లక్షల్లో)
తూర్పు గోదావరి	19,564	105.33	1,003	4.68
కోనసీమ	66,611	327.61	1,596	7.90
కాకినాడ	40,263	195.52	3,371	11.26
అల్లూరి సీతారామరాజు	3,954	15.99	44,831	118.01

సద్వినియోగం చేసుకోవాలి



ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలి. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తించేలా చూస్తున్నాం. ఇంకా ఎవరైనా అర్హత ఉండి, లబ్ధి పొందాలనుకుంటే కుల ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలి. సంబంధిత మండల ఏఈకి దరఖాస్తు చేస్తే పూర్తి విచారణ జరిపి, అర్హులైతే ఉచిత విద్యుత్ కనెక్షన్ ఇస్తారు. వాటికి బిల్లు వచ్చినా వారు నయాపైసా చెల్లించాల్సిన అవసరం లేదు. పూర్తిగా ప్రభుత్వమే చెల్లిస్తుంది.

– టీఎస్ఎన్ మూర్తి, ఎస్ఈ, ఏపీ ఈపీడీసీఎల్, రాజమహేంద్రవరం

ఆబోతు అదృశ్యంపై గ్రామస్తుల ఫిర్యాదు

మలికిపురం: ఆబోతు అదృశ్యంపై కేశనపల్లి గ్రామస్తులు శుక్రవారం మలికిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ గ్రామంలో శాస్త్రోక్తంగా పూజలు చేసి, అచ్చు వేసి వదిలిపెట్టిన ఆబోతు స్థానికుల పూజలు అందుకుని, పెట్టిన ఆహారం తింటూ తిరుగుతోందన్నారు. ఇటీవల ఆ ఆబోతు జాడ లేకపోవడంతో విచారణ చేయగా, అనపర్తికి చెందిన గంగిరెడ్డుల శ్రీను దొంగతనంగా తోలుకు వెళ్లినట్టు తెలిసిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అతడితో ఫోనులో మాట్లాడగా, తానే ఆ ఆబోతును తీసుకుని వెళ్లానని, రాజమహేంద్రవరంలో వదిలేశానని చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేశాడని కేశనపల్లి వాసులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ఆబోతును గంగిరెద్దుల శ్రీను కబేళాకు అమ్మేసినట్టు అనుమానిస్తున్నామని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి, తమ ఆబోతును తిరిగి ఇప్పించాలని వారు కోరారు. ఫిర్యాదుపై సంతకాలు చేసిన వారిలో కేశనపల్లికి చెందిన అడబాల ఏసుబాబు, ఆంజనేయులు, ఏబీ నాయుడు, ఏవీ సుబ్బారావు, ఎ.రాజశ్రీ ఉన్నారు.

ఈపీఎఫ్ కార్యాలయానికి ఉత్తమ అవార్డు



అవార్డుతో కమిషనర్-1 మనోజ్‌కుమార్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయానికి 2023 సంవత్సరానికి గాను బెస్ట్ రీజినల్ ఆఫీస్ (స్మాల్) లభించిందని ఈపీఎఫ్ కమిషనర్-1 మనోజ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఈపీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 71వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ కార్యాలయాలకు వివిధ కేటగిరీల కింద ఈపీఎఫ్ సంస్థ అవార్డులు ప్రకటించిందన్నారు. దీనిలో దేశంలోని 84 చిన్న ప్రాంతీయ కార్యాలయాలకు సంబంధించి తమకు బెస్ట్ రీజినల్ ఆఫీస్ అవార్డు దక్కడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈ నెల 2న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ మంత్రి రామేశ్వర్ తేలి నుంచి ఈ అవార్డు అందుకున్నామని మనోజ్‌కుమార్ చెప్పారు. అవార్డు సాధించిన సిబ్బందిని, అధికారులందను ఆయన అభినందించారు. రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయంలో అనుసరించిన ఉత్తమ పద్ధతులకు ఈ అవార్డు లభించిందన్నారు. కార్యాలయానికి వచ్చే వారి సమస్యలను పరిష్కరించేందుకు స్మైలీ వారియర్లతో కూడిన స్మైలీ జోన్‌ను ఫ్రంట్ ఆఫీసులో ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేకంగా మహిళా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని చెప్పారు. 99 శాతం క్లెయిములను మూడు రోజుల్లోపు, 100 శాతం క్లెయిములను 10 రోజుల్లోపు పరిష్కరించామని వివరించారు. కార్యాలయ పరిసరాల్లో నివసించే, పనికి వెళ్లే మహిళలకు క్రచ్ సౌకర్యం కల్పించామన్నారు. పరిశుభ్రతపై రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ నుంచి స్వచ్ఛత అవార్డు-2021 అందుకున్నామని మనోజ్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో పీఎఫ్ అసిస్టెంట్ కమీషనర్లు వైడీ శ్రీనివాసరావు, ఎం.రామారావు, లోక్‌నాథ్ సాహు పాల్గొన్నారు.



స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



హంస వాహనంపై స్వామి వారి ఊరేగింపు

బ్రహ్మోత్సవం.. నయనమనోహరం

- సరస్వతీ అలంకరణతో హంస వాహన సేవ
- ఘనంగా మహాలక్ష్మీ హోమం, లక్ష కుంకుమార్చన

ఆత్రేయపురం: పావన గౌతమీ గోదావరి తీరాన ఆత్రేయపురం మండలం వాడపల్లి క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు నయనమనోహరంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్వామివారిని వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. భక్తిపారవశ్యంతో బ్రహ్మోత్సవాలను తిలకించి, పులకించారు. ఉత్సవాల రెండో రోజైన శుక్రవారం.. పట్టు వస్త్రాలు, సర్వాభరణాలతో.. ఉభయ దేవేరులతో అలంకృతుడైన స్వామివారికి శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృత మండపారాధన, ప్రధాన హోమాలు, గోదావరి నదీ జల సంగ్రహణ, మహాస్నపనం, లక్ష కుంకుమార్చన, సాయంత్రం స్వస్తివాచనం, ప్రధాన హోమాలు, మహాలక్ష్మీ హోమం, దిగ్దేవతా బలిహరణ తదితర క్రతువులు జరిగాయి. సరస్వతీ అలంకరణలో స్వామివారికి హంస వాహన సేవ నిర్వహించారు. విద్యకు మూలాధారం సరస్వతీదేవి. ఆ తల్లి అధిష్ఠానమైన పరబ్రహ్మ.. హంసను అధిరోహిస్తారు. పాలు, నీళ్లు కలిపి పెడితే హంస పాలను స్వీకరించి, నీళ్లను విడిచిపెడుతుందని చెబుతారు. జీవితంలో భక్తి మార్గం ద్వారా మంచిని అలవర్చుకుని చెడును విడిచిపెట్టాలని చెప్పడమే హంస వాహన పరమార్థం. బ్రహ్మోత్సవాల వైదిక క్రతువులను ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యాన వేద పండితులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఎస్సై బీవై కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

నేటి కార్యక్రమాలు

ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృత మండపారాధన, మహాస్నపనం, ప్రధాన హోమాలు, మహాపుష్పయాగం, సహస్ర దీపాలంకరణ సేవ. సాయంత్రం కోదండరామ అలంకరణతో హనుమద్వాహన సేవ.



గౌతమీ గోదావరి జలాలతో ఆలయ ప్రదక్షిణ



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఈఓ దంపతులు

పట్టించిన ఫోన్ కాల్

- సెల్ లొకేషన్ ఆధారంగా నిందితుడి గుర్తింపు
- ముగ్గురి అరెస్టు
- వీడిన 'కంచి' హత్య కేసు మిస్టరీ

రాయవరం: ఎంత పకడ్బందీగా నేరం చేసినా.. ఏదో ఒక క్లూ నిందితుడిని పట్టిస్తుంది. రాయవరం మండలం వెదురుపాకలో జరిగిన హత్య కేసు నిందితుడిని కూడా ఒక్క ఫోన్ కాల్ పట్టించింది. దీంతో గత నెల 20న వెదురుపాకలో జరిగిన కంచి వెంకట రమణ హత్య కేసు మిస్టరీ వీడినట్లైంది. హత్య జరిగిన 13 రోజుల అనంతరం ముగ్గురు నిందితుల్ని పోలీసులు కటకటాల వెనక్కి నెట్టారు. ఈ వివరాలను రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ రాయవరం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం..

వెదురుపాకకు చెందిన కంచి వెంకట రమణ పాల వ్యాపారం చేసుకుంటున్నాడు. ఆర్థికంగా దెబ్బతిన్న అతడు నష్టపోయిన సొమ్మును రికవరీ చేసుకునేందుకు పూజలు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో వెంకట రమణకు నెల్లూరుకు చెందిన పి.రమేష్‌తో పరిచయం ఏర్పడింది. దీంతో ఏదో ఒకవిధంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో పూజలు చేస్తానంటూ పలువురిని మోసగించే పనిలో వెంకట రమణ ఉన్నాడు. ఈ విధంగా రామచంద్రపురం, అనపర్తి ప్రాంతాల్లో పలువురికి పూజలు చేయించినట్లు పోలీసులు గుర్తించారు.

చిన్నాన్నే హంతకుడు

వెంకట రమణ వెదురుపాకలో నివాసం ఉంటూ పాలకేంద్రం నిర్వహించుకుంటున్నాడు. అతడి పిన్ని దుర్గ కొన్నేళ్ల క్రితం ఒడిశాలో నివాసం ఉండేది. ఆమెకు ఉప్పాడ కొత్తపల్లికి చెందిన స్వామిరెడ్డి సూరిబాబుతో పరిచయం ఏర్పడగా, అది సహజీవనానికి దారి తీసింది. వెదురుపాకలో ఉన్న ఇంటిని దుర్గ కొన్నేళ్ల క్రితం పునర్నిర్మించుకుంది. దుర్గ, సూరిబాబు అప్పుడప్పుడు వెదురుపాక వస్తూ పోతూ ఉన్నారు. ఈ నేపథ్యంలో దుర్గ అక్క కొడుకు కంచి వెంకట రమణకు, సూరిబాబుకు పరిచయం ఏర్పడింది. కరోనా సమయంలో దుర్గ, ఆమె ఇద్దరు కుమార్తెలు అనారోగ్యం పాలవడంతో, వారికి దెయ్యం పట్టిందని, తాను నయం చేస్తానని చెప్పిన వెంకటరమణ సుమారు రూ.50 వేలు తీసుకుని పూజలు చేశాడు. అయినప్పటికీ తగ్గకపోవడంతో దుర్గను, పిల్లలను సూరిబాబు కాకినాడ ఆస్పత్రిలో ఉంచి వైద్యం చేయించాడు. తనను పూజల పేరుతో వెంకట రమణ మోసం చేశాడనే బాధ సూరిబాబులో ప్రారంభమైంది. ఇదిలా ఉండగా వెదురుపాకలోని ఇంటిని అమ్మే ప్రయత్నాలకు వెంకట రమణ అడ్డం పడుతూ వచ్చాడు. జరుగుతున్న ఈ పరిణామాలకు వెంకట రమణే కారణమని భావించిన సూరిబాబు.. అతడిని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. దీంతో తన వద్ద పనిచేస్తున్న ఉప్పాడ కొత్తపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులతో కలిసి పథకం రచించాడు. ఈ నెల 16న ఒడిశా నుంచి ఏ2 నిందితుడు గెడ్డం ఏసుబాబుతో కలిసి మోటార్ సైకిల్‌పై నేరుగా వెదురుపాక వచ్చాడు. మరో నిందితుడు పురికుర్తి తలుపులయ్యను యు.కొత్తపల్లి నుంచి రప్పించారు. ఈ ముగ్గురూ కలిసి వెంకట రమణను అంతమొందించేందుకు రెక్కీ నిర్వహించారు.



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్

ఫోన్ చేసి.. దొరికిపోయి..

ప్రధాన నిందితుడు సూరిబాబు నిత్యం వాడే ఫోన్ నంబర్ కాకుండా ఒడిశాలో రెండు సెల్‌ఫోన్లు కొన్నాడు. వాటి ద్వారానే మాట్లాడేవాడు. హత్య జరిగిన రోజున సూరిబాబు అనివార్య పరిస్థితుల్లో సొంత నంబర్ నుంచే వెంకట రమణకు ఫోన్ చేశాడు. వెంకట రమణ పాల కేంద్రం వద్దకు సూరిబాబు రావడాన్ని, అతడిని తీసుకు వెళ్లడాన్ని చూసిన వ్యక్తి వెంకట రమణ భార్య విజయలక్ష్మికి తెలిపాడు. దీంతో విషయాన్ని నిర్ధారించుకునేందుకు సూరిబాబుకు విజయలక్ష్మి ఫోన్ చేసింది. అతడి ఫోను, భర్త వెంకట రమణ ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో దుర్గకు ఫోన్ చేసింది. సూరిబాబు ఒడిశాలోనే ఉన్నాడని దుర్గ చెప్పడంతో తొలుత మిన్నకుంది. హత్య అనంతరం సూరిబాబు మరో నిందితుడు గెడ్డం ఏసుబాబుతో కలిసి ఒడిశాలోని జునాఘడ్‌కు వెళ్లిపోయాడు. ఈ నెల 22న మరోసారి దుర్గకు ఫోన్ చేయగా ఆమె సూరిబాబుతో మాట్లాడించింది. ఇదిలా ఉండగా పోలీసు విచారణలో వెంకట రమణను సూరిబాబు తీసుకు వెళ్లినట్లు నిర్ధారణ అయ్యింది. దీనికి తోడు సూరిబాబు సెల్ స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో సూరిబాబు కాల్ డేటాను పరిశీలించగా, హత్యకు ముందు సూరిబాబు సెల్ నంబర్ వెదురుపాక సెల్ టవర్‌లో చూపించింది. దీంతో పోలీసులు అనుమానంతో సూరిబాబును అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా వెంకట రమణను తానే హత్య చేసినట్టు ఒప్పుకున్నాడు. నిందితులు ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిని అనపర్తి జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ముందు శనివారం హాజరుపరచుతామని డీఎస్పీ ప్రసాద్ తెలిపారు. విలేకర్ల సమావేశంలో మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌కుమార్, ఎస్సై జి.నరేష్ పాల్గొన్నారు.

తల్లి ఒడికి దూరమై.. తుప్పల పాలై..



తుప్పల్లో లభ్యమైన పసికందు

ఉప్పలగుప్తం: అన్నెంపున్నెం ఎరుగని ఆ పసికందు.. పుట్టిన కొద్ది గంటల్లోనే తల్లి ఒడికి దూరమైంది.. విషక్రిములు సంచరించే తుప్పల పాలైంది. మనసును కలచివేసే ఈ సంఘటన మండలంలోని ఎన్.కొత్తపల్లి గ్రామ పంచాయితీ పరిధి నల్లవారిపేటలో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసులు, వైద్యుల కథనం ప్రకారం.. నల్లవారిపేట బహిర్భూమిలో ఉదయం పసికందు ఏడుపు వినిపించింది.

అటుగా వెళ్తున్న స్థానికులు అక్కడకు వెళ్లి చూడగా తుప్పల్లో చిన్న పసికందు కనిపించింది. దీంతో వారు స్థానిక ఏఎన్ఎంకు సమాచారం అందించారు. విషయం తెలియడంతో వైద్య సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఆ ఆడ శిశువు జన్మించి ఒక రోజు అయ్యిందని గుర్తించి ఎస్.యానాం పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పోలీసులకు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. కోమలమైన లేత పూల రేకులా ఉన్న ఆ చిన్నారి శరీరంపై స్వల్పంగా గాయాలయ్యాయి.

ఆ చిన్నారికి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామని వైద్యులు ఢిల్లీ ప్రసాద్ తెలిపారు. అనంతరం ఆ పసికందును కాకినాడలోని శిశు సంక్షేమ కేంద్రానికి తరలిస్తామని ఐసీడీఎస్ సీడీపీఓ కేవీఎల్‌డీ కుమారి తెలిపారు. ఈ ఘటనపై సీఐ పి.వీరబాబు నేతృత్వంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకుని మహిళ మృతి

పెద్దాపురం: మతిస్థిమితం లేని మహిళ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన శుక్రవారం పెద్దాపురంలో చోటు చేసుకుంది. స్థానిక దర్గా సెంటర్ నుంచి సినిమా సెంటర్‌కు వెళ్లే రహదారిలో ఐస్ ఫ్యాక్టరీ వద్ద ఈ సంఘటన జరిగింది. పట్టణానికి చెందిన మతిస్థిమితం లేని కె.లక్ష్మి (43) అటుగా వెళ్తూ అకస్మాత్తుగా ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్సై వి.సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పేదలందరికీ ఇళ్లే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- కోలాహలంగా ఇళ్ల పట్టాల పండగ 1,861 మందికి పంపిణీ

ఆలమూరు: ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని, ఆ దిశగా దేశంలో మరెక్కడా లేని విధంగా జగనన్న కాలనీలు నిర్మిస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని గుమ్మిలేరు, ఆలమూరు, జొన్నాడ గ్రామాల్లో శుక్రవారం రికార్డు స్థాయిలో 1,861 మందికి ఆయన ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, సర్పంచ్‌లు నేలపూడి లావణ్య, కట్టా శ్రీనివాస్, గుణ్ణం రాంబాబు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సమావేశాలకు ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ, గత సార్వత్రిక ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా నిరుపేద మహిళందరికీ మౌలిక వసతులతో కూడిన కాలనీల్లో ఇళ్లు నిర్మించేందుకు నియోజకవర్గంలో సుమారు 450 ఎకరాలు సేకరించి, దాదాపు 17,300 మందికి దశలవారీగా పట్టాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే రూ.కోట్ల వ్యయంతో స్థలాలను మెరక చేసి, ఇళ్లు నిర్మించేందుకు అనువుగా చర్యలు తీసుకున్నామన్నారు. అక్కచెల్లెమ్మలకు సీఎం జగన్ ఆడపడుచు కట్నంగా రూ.లక్షల విలువైన ఆస్తి అందిస్తున్నారని చెప్పారు. కనీస సదుపాయాలు కల్పించి విలువైన ఇళ్లు నిర్మిస్తున్నామనేందుకు ఆలమూరులోని యర్ర కాలనీయే నిదర్శమన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు మహిళలను అన్ని విధాలా మోసగిస్తే.. నేటి సీఎం జగన్ మాత్రం నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలనకు, ఆర్థిక స్వావలంబనకు చిత్తశుద్ధితో పాటు పడుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క నిరుపేదకు కూడా పట్టా ఇవ్వలేదని, అర్జీలు ఇస్తే చెత్తబుట్టలో పడేశారని గుర్తు చేశారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వం చేస్తున్న మంచిని గుర్తించి, రానున్న ఎన్నికల్లో సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని జగ్గిరెడ్డి విజ్ఞప్తి చేశారు.



గుమ్మిలేరులో మహిళలకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

సంప్రదాయ రీతిలో ఇళ్ల పట్టాల అందజేత

మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు రూ.85 కోట్లతో కొనుగోలు చేసి, అభివృద్ధి చేసిన 101.70 ఎకరాల్లో 4,625 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తెలిపారు. తొలి విడతలో సుమారు 2 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయగా రెండవ విడతలో 1,861 మందికి అందజేశామని వివరించారు. ఈ సందర్భంగా జొన్నాడలో 102, ఆలమూరులో 604, గుమ్మిలేరులో 1,155 మంది మహిళలకు సంప్రదాయ రీతిలో పసుపు, కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలను తాంబూలంతో కలిపి ఇళ్ల పట్టాలను జగ్గిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు తోరాటి సీతామహాలక్ష్మి, బూత్ కమిటీ మేనేజర్ నామాల శ్రీనివాస్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, పీఏసీఎస్ అధ్యక్షుడు మోటుపల్లి వెంకన్న, ఉపసర్పంచ్ చల్లా సీతా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అయ్యప్ప స్వాముల భజనకు సౌండ్ సిస్టమ్ పెడుతుండగా ఘటన



దుర్గా రవికుమార్ మృతదేహం

నిడదవోలు: అయ్యప్ప స్వాముల భజన ఏర్పాట్లలో అపశ్రుతి చోటు చేసుకోంది. ఈ కార్యక్రమానికి సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్న ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మండలంలోని తాళ్లపాలెంలో ఈ సంఘటన శుక్రవారం జరిగింది. నిడదవోలు పట్టణ ఎస్సై పి.నాగరాజు కథనం ప్రకారం.. పంచాయతీ కార్యాలయం సమీపాన అయ్యప్ప స్వాముల భజనలు ఏర్పాటు చేశారు. దీనికి అవసరమైన సౌండ్ సిస్టమ్‌ను పట్టణానికి చెందిన రవి సౌండ్ సిస్టమ్ నిర్వాహకుడు క్రొవ్విడి దుర్గా రవికుమార్ (35) ఏర్పాటు చేస్తున్నాడు. సౌండ్ సిస్టమ్ వైర్లను అమర్చుతూండగా అవి కాస్తా 11 కేవీ విద్యుత్ వైర్లకు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. అతడిని వెంటనే నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. రవికుమార్‌కు భార్య సురేఖతో పాటు ఇద్దరు పిల్లలున్నారు.



వలలో అల రొయ్యలు

సముద్రంలో అరుదుగా దొరికే 'అల రొయ్యలు' శుక్రవారం మత్స్యకారుల వలలకు చిక్కాయి. వీటిని ఎక్కువగా ఎగుమతి చేస్తారని వారు చెప్పారు. పరిమాణాన్ని బట్టి కేజీ రొయ్యలను సుమారు రూ.1,000 నుంచి రూ.1,500 వరకూ కొనుగోలు చేస్తారని తెలిపారు.

– కొత్తపల్లి